రూ.4 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని, నాయకులు, అధికారులు

పాల్వంచ, జూలై 9: పాల్వంచ పట్టణ జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు అన్నారు. మంగళవారం మునర్సిపాలిటీ పరిధిలోని కేసీఆర్ నగర్, అయ్యప్పనగర్, రాజీవ్‌గాంధీ మార్కెట్, కళాభవన్, రాహుల్‌గాంధీనగర్, వెంగళరావు కాలనీ ప్రాంతాల్లో రూ.4 కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వివేక్, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ స్వామి, ఆర్‌అండ్‌బీ డీఈ నాగేశ్వరరావు, పట్టణ ఎస్సై బాణాల రాము, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, విశ్వనాథం, సాయిబాబాబ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

టేకులపల్లి, జూలై 9: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్క పిల్లలవాడు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఇల్లెందు డీఎస్పీ ఎన్ చంద్రభాను అన్నారు. మంగళవారం టేకులపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ, హాస్టల్ విద్యార్థులకు సీఐ టీ సురేష్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం సమాజంలో సైబర్ నేరాలు ఎక్కువ జరుగుతున్నాయని కావున్న విద్యార్థి దశ నుంచే పిల్లలు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కోయగూడెం ఉపరితల గనిలో బోడు ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది నర్సింహారావు పాల్గొన్నారు.

వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి: డీఎస్పీ

మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

మణుగూరు టౌన్ జూన్ 9: వరదల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మణుగూరులోని గోదావరి వరద ముంపు ప్రాంతాలైన కమలాపురం గ్రామస్తులతో ఆయన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యాధులు రాకుండా కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ముంపునకు గురయ్యే సమయంలో అధికారులకు పూర్తి సహకారం అందించి పునరావాస కేంద్రాలకు తరలిరావాలని సూచించారు. అనంతరం సైబర్ నేరాలపై యువతకు అవగాహన కల్పించారు. డ్రగ్, గంజాయి వినియోగంపై సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ సతీశ్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ ఆవశ్యకతపై వర్క్‌షాపు

కొత్తగూడెం సింగరేణి, జూలై 9 : సింగరేణి సంస్థ కార్పొరేట్ ఏరియాలోని ఇల్లెందు క్లబ్‌లో మంగళవారం సింగరేణివ్యాప్తంగా సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ ఆవశ్యకత, అమలుపర్చుయడం, కార్మిక సంఘాల పాత్ర అనే అంశంపై ఒకరోజు వర్క్‌షాపు నిర్వహించారు. కొత్తగూడెం కార్పొరేట్, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు ఏరియాల జీఎంలు, ఏరియా సేఫ్టీ అధికారులు, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘం నాయకులు, కొత్తగూడెం రీజియన్‌లోని అన్ని గనులు, డిపార్ట్‌మెంట్ల పిట్ సెక్రటరీలు, వర్కమెన్ ఇన్‌స్పెక్టర్లు జీఎం సేఫ్టీ గురవయ్య అధ్యక్షతన పాల్గొన్నారు. డైరెక్టర్ పా మాట్లాడుతూ... పని ప్రదేశాల్లో సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లానవను అనుసరించి గనులు, డిపార్ట్‌మెంట్‌లలో భద్రతా సూత్రాలను పాటిస్తూ పని చేయాలన్నారు. డీజీఎం ఎస్ఏటీ గోపాలరాజు, కేజీఎం రీజియన్ కృష్ణ గోపాల్ తివారి, ఏరియా జీఎం శాలెంరాజు, ఇల్లెందు జీఎం జానర్ ఆనంద్, జీఎం దామోదర్‌రావు, డీజీఎం గోపాలరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి

చర్ల, జూలై 9: మండల కేంద్రంలోని కన్యకా పరమేశ్వరి సాయిబాబా గుడి సమీపంలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూమిని అధికారులు వెంటనే స్వాధీనం చేసుకోవాలని కోరుతూ రెండు రోజులుగా సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేస్తూన్న రిలే నిరాహార మంగళవారానికి రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా మాస్‌లైన్ పార్టీ నాయకుడు కొండా కౌశిక్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని కూడా అందజేశామన్నారు. స్పందించిన అధికారులు పరిశీలన జరిపి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

CHANGE OF NAME

★I, **NIDIKONDA SREENU** CHANGED MY NAME AS **NIDIKONDA SRINU** S/O. NIDIKONDA RAMULU, R/O. FNO.104, RENUKA APARTMENT, GOLLAGUDEM, PALVANCHA, 507115, BK DIST. KMM

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములలో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మండలంలో భారీ వర్షం

టేకులపల్లి, జూలై 9:మండలంలో కురిసిన భారీ వర్షంతో పలు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మంగళవారం మండల వ్యాప్తంగా మధ్యాహ్నం నుంచి కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. అనిశెట్టిపల్లి నుంచి సంపత్‌నగర్ వెళ్లే ప్రధాన రహదారికి మధ్యలో పుణ్యపు వాగు బ్రిడ్జిపై నుంచి భారీ వరద రావడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అదేవిధంగా కోయగూడెం ఉపరితల గనిలో బొగ్గు ఉత్పత్తి, ఓబి పనులు నిలిచిపోయాయి

నేడు మెగా వైద్యశిబిరం

పాల్వంచ, జూలై 9 : కేఎల్‌ఆర్ విద్యాసంస్థల అధినేత జయంతి సందర్భంగా బుధవారం కేఎల్‌ఆర్ ఫార్మసీ కాలేజీలో మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ సిద్దార్థరెడ్డి తెలిపారు. ఫార్మసీ కాలేజీ లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కార్డియాలజీ, జనరల్ ఫిజిషియన్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, డెర్మటాలజిస్టు వైద్యుల ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 12వ తేదీన మెగా రక్తదాన శిబిరం కూడా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

భక్తిశ్రద్ధలతో సీత్లా పండుగ

గుండాల: గుండాల తండాలో మొక్కులు చెల్లించుకుంటున్న బంజారాలు, ఇల్లెందు రూరల్: నైవేద్యాన్ని తీసుకెళ్తున్న బంజారాలు, టేకులపల్లి:పూజలు చేస్తున్న భక్తులు

గుండాల, జూలై 9: బంజారాల తొలి పండుగ సీత్లా (దాటుడు) పండుగను మండలంలోని గుండాల తండా, రోళ్లగడ్డ, నర్సాపురం తండా, జగ్గుతండా గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. పంటలు సమృద్ధిగా పండాలని ప్రగాఢనమ్మకంతో వారి కుల దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. తండాలోని అన్ని కుటుంబాలు ఒక దగ్గరికి చేరి సకల దేవతలు కరుణించాలని, వానలు కురవాలని, పాడి పంటలతో సుఖసంతోషాలతో సల్లంగా ఉండాలని దేవతలకు వేడుకున్నారు. డప్పు వాయిద్యాలతో చిన్నా పెద్దా తేడాలేకుండా నృత్యాలు చేశారు. గ్రామ పొలిమేరలో ఉన్న కుల దేవతకు నైవేద్యం సమర్పించారు.

ఇల్లెందు రూరల్‌లో..

ఇల్లెందు రూరల్, జూలై 9: సీత్లాదేవి పండుగను బంజారాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని కొమరారం గ్రామ పంచాయతీల్లోని బంజారా మహిళలు, యువతులు సీత్లాదేవిని పూజించి ఘుగ్రీ, లప్సి నైవేద్యాన్ని సమర్పించారు. పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లు, పశుసందప పెరగాలని, పశువులు క్రూర మృగాల బారిన పడకుండా ఉండాలని పూజలు చేశారు. పంట పొలాల్లోకి వెళ్లి పంటలు సమృద్ధిగా పండాలని, పాడి, పశుసంపద ఆరోగ్యంగా వర్ధిల్లాలని వేడుకున్నారు.

టేకులపల్లిలో..

టేకులపల్లి, జూలై 9: మండలంలోని ప్రతి తండాలలో గిరిజన బంజారాలు సీత్లా పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వర్షాలు మంచిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని గిరిజన బంజారాల దేవతలను వేడుకున్నారు. తండావాసులు సీత్లా యాడి దగ్గరకు, పశువులతో కలిసి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

జూలూరుపాడులో..

జూలూరుపాడు, జూలై 9 : మండలంలోని పలు గిరిజన పల్లెల్లో సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా గిరిజనులు భక్తిశ్రద్ధలతో సీత్లా పండుగ మంగళవారం జరుపుకున్నారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు తీర్చుకున్నారు. వర్షాలు సంవృద్ధిగా కురిసి పాడి పశువులతో ప్రజలు ఆయురారోగ్యాలతో క్షేమంగా ఉండాలని పూజలు చేశారు. చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా అందరూ సంబురాల్లో మునిగిపోయారు.

పాల్వంచరూరల్‌లో..

పాల్వంచ రూరల్, జూలై 9 : మండలంలోని కొత్తసూరారం, పాండురంగాపురం, జగన్నాధపురం, రంగాపురం తదితర ప్రాంతాల్లో సీత్లా భవాని వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. శంకర్, కిషన్, రవి, దశరథ్, హత్తిరామ్, నందా పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాల్వంచ, జూలై 9: పాల్వంచ ఇందిరాకాలనీలోని సబ్ స్టేషనలో మరమ్మతుల దృష్ట్యా బుధవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ(ఆపరేషనల్) లక్ష్మణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హమాలీ కాలనీ, వికలాంగుల కాలనీ, జయమ్మ కాలనీ, కాంట్రాక్టర్స్ కాలనీ, బాపూజీ నగర్, వెంకటేశ్వర హిల్స్ కాలనీ ఏరియాల ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు గండుగులపల్లిలో విద్యుత్ వినియోగదారుల కోర్టు

దమ్మపేట, జూలై 9: మండలంలోని గండుగులపల్లి సెక్షన్ కార్యాలయంలో బుధవారం విద్యుత్ వినియోగదారుల కోర్టు జరుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ మహేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చడం, విద్యుత్ బిల్లుల హెచ్చుతగ్గులు, లో, హై ఓల్టేజీలు తదితర సమస్యలపై ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో చైర్మన్ వేణుగోపాచారి, సభ్యులు రమేశ్, చరణ్‌దాస్, నరేంద్ర హాజరవుతారని లిపారు.

నిందితులను శిక్షించాలి

చుంచుపల్లి, జూలై 9 : జిల్లాలోని అశ్వారావుపేట ఎస్సై ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని, నిందితులను వెంటనే శిక్షించాలని బీఆర్ఎస్ జిల్లా యువనేత మూడ్ జయరాంనాయక్ అన్నారు. మంగళవారం చుంచుపల్లిలో ఆయన మాట్లాడుతూ ఎస్సై స్థాయి అధికారికే వేధింపులు జరిగితే కిందిస్థాయి వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి

ఇల్లెందు రూరల్, జూలై 9: కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ అన్నారు. మంగళవారం మండలంలోని రాఘబోయిన గూడెం, జింకల తండా, బోడియాతండాల్లో పర్యటించి కౌలు రైతులతో మాట్లాడారు. కౌలు రైతులకు రుణ అర్హత కార్డులతో పాటు రైతు భరోసా కార్డులు ఇవ్వాలన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

చుంచుపల్లి, జూలై 9 : మండలంలోని విద్యానగర్‌కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉన్న 30 మంది విద్యార్థులకు మంగళవారం నోట్ పుస్తకాలను అందించారు. తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దాతలు జీఎంవీ ప్రసాదరావు, మైనేని బసవయ్య, దండమూడి చైతన్య, రవీంద్ర ఆర్థికసాయంతో పుస్తకాలు అందించారు.

డ్రైన్లలో పూడికతీత పనులు

కొత్తగూడెం అర్బన్, జూలై 9: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని జాతీయ రహదారి పక్కన డ్రైన్ పూడికతీత పనులను మంగళవారం మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది చేపట్టారు. కొన్ని సంవత్సరాలుగా శుభ్రం చేయకపోవడంతో చెత్తాచెదారం నిండిపోయి డ్రైన్లు దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఎట్టకేలకు మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి స్పందించి పూడికతీత పనులను చేయిస్తున్నారు.

పంప్ హౌస్ ట్రయల్ రన్ పనులు పూర్తి చేయాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

పంప్‌హౌస్ పనులపై అధికారులతో చర్చిస్తున్న తుమ్మల

ములకలపల్లి, జూలై 9: సీతారామ ప్రాజెక్టు పంప్ హౌస్ ట్రయల్ రన్ పనులను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. మండలంలోని పూసుగూడెం సమీపంలో నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టు పంప్ హౌస్ పనులను మంగళవారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పంప్ హౌస్ పనులపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ట్రయల్ రన్‌కు మోటార్లు బిగించటం కొంత ఆలస్యమైందని, ఇందుకు అవసరమైన సాంకేతిక నిపుణులు చైనా నుంచి రావాల్సి ఉందని అధికారులు మంత్రికి వివరించారు. చైనా నుంచి నిపుణులు రావటానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి సూచించారు. మంత్రి వెంట జిల్లా కలెక్టర్ జితేష్ వీ పాటిల్, ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ పీవో రాహుల్, ఇరిగేషన్ అధికారులు రాంరెడ్డి, మోతీలాల్, గపూ, తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అధికారులతో మాట్లాడుతున్న శాంతికుమారి

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 9 (నమస్తే తెలంగాణ) : సీజనల్ వ్యాధుల నియంత్రణకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. మంగళవారం ఆమె ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఐడీవోసీ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఐటీడీఏ పీవో రాహుల్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. వన మహోత్సవం, ప్రజాపాలన, సహాయ కేంద్రాల నిర్వహణ, మహిళాశక్తి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ, వానకాలం పంటల సాగు, సీజనల్ వ్యాధుల నియంత్రణ, ప్రభుత్వ పాఠశాలల్లో ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాల పంపిణీ, పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారం, ఉద్యోగుల సాధారణ బదిలీలు వంటి అంశాలపై ఆమె సుదీర్ఘంగా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మంచినీటి పంపులు నిర్మించాలని, వాటి ద్వారా వంటగదిపై ఉన్న సింటెక్ ట్యాంక్‌లో నీరు నింపాలని, మంచినీటి కోసం వేరే సింటిఎక్స్ ట్యాంకు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో విద్యాచందన, డీఈవో వెంకటేశ్వరచారి, డీఎం హెచ్‌వో భాస్కర్ నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు, ట్రైబల్ వెల్ఫేర్ తానాజీ, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ఈఈ పీఆర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులు ఖాతా నమోదు చేసుకోవాలి

ఇల్లెందు రూరల్, జూలై 9: కాంట్రాక్టు కార్మికులు జీరో అకౌంట్ ఖాతాను నమోదు చేసుకోవాలని ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ అన్నారు. మంగళవారం జీఎం కార్యాలయంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అధికారులు, కాంట్రాక్టర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సింగరేణి సంస్థలో కాంట్రాక్టు కార్మికులకు ప్రమాదబీమా పేరిట హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుతో సింగరేణి సంస్థ ఒప్పందం చేసుకుందన్నారు. ప్రతీ కాంట్రాక్టు కార్మికుడు జీరో అకౌంట్‌తో ఖాతా తెరుచుకోవాలన్నారు. దీంతో కాంట్రాక్టు కార్మికుడు డ్యూటీలో గాని, బయట మృతిచెందితే వారి కుటుంబానికి బీమా కింద రూ.20 లక్షలు అందజేస్తారన్నారు. కార్మికుడు డెబిట్ కార్డు 6 నెలల్లో ఒకసారి స్వైపింగ్ చేసి ఉపయోగించనట్లయితే ఆ కుటుంబాలకు అదనంగా రూ.10 లక్షలు ఇవ్వబడుతాయన్నారు. 18 సంవత్సరాలలోపు పిల్లలు ఎవరైనా ఉండి చదువుకున్నట్లయితే వారికి రూ.4 లక్షలు అందజేస్తారన్నారు. ఏరియాలోని అన్ని విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు ఖాతా నమోదు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, డీజీఎం సివిల్ రవికుమార్, ఫైనాన్స్ మేనేజర్ మధుబాబు, బ్యాంకు అధికారులు రహీం పాష, లక్ష్మీనారాయణ, రవి, సీనియర్ పర్సనల్ అధికారి సాయి స్వరూప్, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

ఏఎస్పీ అంకిత్ కుమార్

చర్ల, జూలై 9: యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని భద్రాచలం ఏఎస్పీ అంకిత్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని యువతకు స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశ భవిష్యత్‌కు యువత కేంద్ర బిందువు అని, యువత తలుచుకుంటే ఎన్నో విజయాలు సునాయాసంగా సాధించవచ్చునని అన్నారు. చదువుకునే విద్యార్థులను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పోలీసుశాఖ ముందుంటుందని అన్నారు. మండంలోని చర్ల, గుంపెనగూడెం, దండుపేట, ఆర్ కొత్తగూడెం, సున్నంగుంపు, కుదునూరు, బూరుగుపాడు, చింతకుప్ప, రామచంద్రపురం, గన్నవరం, ఉప్పరిగూడెం, కొయ్యూరు, చీమలపాడు, సుబ్బంపేట, ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థుకు ఏఎస్పి స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో సీఐ రాజువర్మ, ఎస్సై నర్సిరెడ్డి, సీఆర్‌పీఎఫ్ అధికారులు పాల్గొన్నారు.

శ్రీరాములు కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి తుమ్మల

శ్రీరాములు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే

దమ్మపేట, జూలై 9: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ జడ్పీటీసీ కోండ్రు శ్రీరాములు కుటుంబాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మంగళవారం పరామర్శించారు. అదేవిధంగా మాజీ ఎంపీపీ పానుగంటి సత్యం కుటుంబాన్ని పరామర్శించారు. సత్యం చిత్ర పటానికి పూలమాల వేసి నివాళర్పించారు.

శ్రీభక్తాంజనేయస్వామికి 108 బిందెలతో అభిషేకాలు

అభిషేకాలు చేస్తున్న రైతులు

అశ్వారావుపేట టౌన్, జూలై 9: పట్టణ సమీపంలో ఉన్న వెంకమ్మ చెరువు కట్టపై కొలువైయున్న శ్రీభక్తాంజనేయస్వామికి ఆయకట్టు రైతులు మంగళవారం 108 బిందెలతో అభిషేకాలు నిర్వహించారు. రైతులు సమృద్ధిగా వర్షాలు కురవాలని, పాడి పంటలతో రైతుల కుటుంబాలు, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ స్వామికి అభిషేకించారు. అనంతరం స్వామికి మొక్కులు చెల్లించుకుని అన్నసమారాధన నిర్వహించారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడాలి

అన్నపురెడ్డిపల్లి, జూలై 9: గ్రామాల్లో పారిశుధ్యం మెరుపడేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాగారు. మండలంలో పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకొన్నారు. తొలుత మండల ప్రజాప్రతినిధులను శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం అన్నపురెడ్డిపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్, ఎంపీడీవో మహాలక్ష్మి, ఎంఈవో సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

రామయ్యకు నిత్య కల్యాణం

భద్రాచలం, జూలై 9: భద్రాద్రి దివ్యక్షేత్రంలో మంగళవారం సీతారాములకు నిత్య కల్యాణం ఘనంగా జరిపారు. అర్చకులు తెల్లవారు జామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య హోమాలు, నిత్య బలిహరణం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి నిత్య కల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి సంప్రదాయ బద్ధంగా కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న 18 మంది దాతలకు స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

రామయ్య సేవలో ప్రభుత్వ విప్

భద్రాచలం, జూలై 9: భద్రాద్రి రామయ్యను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. తొలుత ధ్వజస్థంభం వద్ద నమస్కరించుకొని అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట ఆలయ సూపరింటెండెంట్ కత్తి శ్రీనివాస్, లింగాల సాయిబాబా, వేద పండితులు హనుమత్ శాస్త్రి, ఎల్ఆర్‌కే ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

'అర్ధాకలితో విద్యార్థులు చదువుకునే దెట్లా'

చండ్రుగొండ, జూలై 9: ఇంటి దగ్గర పరిస్థితులు బాగాలేకనే మధ్యాహ్నభోజన పథకం అన్నం ఉంటుందనే నమ్మకంతో పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపుతున్నామని బీఆర్ఎస్ రావికంపాడు గ్రామ అధ్యక్షుడు భూపతి రమేశ్, గ్రామస్తులు అన్నారు. మంగళవారం ఇంటి నుంచి అన్నం బాక్సులతో వస్తున్న విద్యార్థులతో ఆయన మాట్లాడారు. కొన్ని నెలలుగా విద్యార్థులకు మధ్యాహ్నభోజనం లేదని గ్రామస్తులు తెలిపారు. నాన్ని పెట్టడం లేదనే విషయాన్ని తెలుసుకొని, ఆయన గ్రామస్తులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నభోజన పథకాన్ని అమలు చేయకపోవడం విచారకరమన్నారు.

హాస్టల్ వర్కర్లకు వేతనాలు చెల్లించాలి

ఇల్లెందు రూరల్, జూలై 9: 17 నెలలుగా హాస్టల్ వర్కర్లకు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కొలగాని బ్రహ్మాచారి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని కోరగుట్ట పీఎంహెచ్ హాస్టల్ వద్ద జరిగిన హాస్టల్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం అధికారంలోకి వస్తే అసంఘటిత రంగ కార్మికులకు, స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు ఇస్తానని మేనిఫెస్టోలో పెట్టి నేడు విస్మరించిందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్‌నబి, తాళ్ళూరి కృష్ణ, కుంజా జయ, ఈసం స్వరూప, పాయం విజయ భారతి, తాటి భారతి, తోలెం సుజాత, హళావత్ అనిత పాల్గొన్న